ప్రజాశక్తి
బుధవారం 23 జులై 2025
5
అనంతపురం

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

స్మార్ట్‌మీటర్లను అడ్డుకుందాం

అదానీ కోసం ప్రజలపై భారాలు తగదు

విద్యుత్ భారాలపై ఐక్యపోరాటం - సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్పొరేట్లకు మేలు చేస్తూ ప్రజలపై భారాలు మోపేలా వ్యవసాయ పంపుసెట్లు గృహాలు, ఇతర వాటికి ఏర్పాటు చేయనున్న స్మార్ట్‌మీటర్లను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరంలోని ఎన్జీవో హోంలో సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎస్‌యుసిఐ కార్యదర్శి రాఘవేంద్ర, సిపిఐ ఎంఎల్ ఏసు రత్నం తదితరులు పాల్గొని మాట్లాడారు. స్మార్ట్‌మీటర్లు బిగించే కార్యక్రమాన్ని ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. అనుమతి లేకుండా, మోసపు మాటలు చెప్పి గృహాలను వీటిని బిగించే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని బిగిస్తే ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. స్మార్ట్‌మీటర్ల వల్ల కగిలే నష్టాలను గుర్తించి ప్రతి ఒక్కరూ దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. బిల్లులు వేయడం, విద్యుత్ సరఫరా అంతా కూడా ఆదానీ కంపెనీ చేస్తుందన్నారు. ఒక్కసారి కార్పొరేట్ కంపెనీ చేతుల్లోకి వెళ్తే భవిష్యత్తు మొత్తం ప్రజలు వారిచెప్పినంత విద్యుత్ ఛార్జీలు చెల్లించకతప్పదన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్‌ను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా వీటిని తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామ, పట్టణ, కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేసి స్మార్ట్ మీటర్ల వల్ల జరిగే నష్టాన్ని వివరిస్తూ చైతన్యం చేస్తామన్నారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 4 వరకు వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 5న అన్ని విద్యుత్ కార్యాలయాల ముందు విద్యుత్ వినియోగదారులతో నిరసనలు, ధర్నాలు చేస్తామన్నారు. ప్రజలందరూ ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సిఐటియు అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఆర్‌వి.నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, కేశవరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, చెన్నప్ప యాదవ్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పాల్గొన్నారు.

ఓటి చెరువులు..!

◆ మూడొంతులు ఖాళీయే ◆ మూడు శాతమే నీళ్లు ◆ హంద్రీనీవాపైనే ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రధాన ప్రాజెక్టులన్నీ నీళ్లతో కళకళాడుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న చెరువులన్నీ ఓటి కుండల్లా ఉన్నాయి. అత్యధిక చెరువుల్లో చుక్కనీరు లేకుండా ఖాళీగానున్నాయి. కేవలం మూడు శాతం చెరువుల్లో మాత్రమే పూర్తిస్థాయి నీళ్ల ఉన్నాయి. మూడొంతులు చెరువులు ఖాళీగానున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1484 చెరువులున్నాయి. అనంతపురం జిల్లాలో 304 చెరువులు. సత్యసాయి జిల్లాలో 1180 చెరువులున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 304 చెరువులున్నాయి. ఇందులో 32 చెరువులు పూర్తిస్థాయి నీటి సామర్థ్యంతో నిండి ఉన్నాయి. ఎనిమిది చెరువుల్లో 75 శాతం నీళ్లున్నాయి. 26 చెరువుల్లో 50 శాతం ఉండగా, 51 చెరువుల్లో 25 శాతం నీళ్ల ఉన్నాయి. 187 చెరువుల్లో చుక్కనీరు లేదు. సత్యసాయి జిల్లాలో 1180 చెరువులున్నాయి. 13 చెరువులున్నాయి. ఏడు చెరువుల్లో 50 శాతం నిండి ఉన్నాయి. యాభై శాతం

27 చెరువుల్లో నీళ్ల ఉన్నాయి. 25 శాతం నీళ్లున్నవి 299 ఉన్నాయి. 833 చెరువుల్లో నీటి చుక్కలేదు.

నీరు కూడా మూడో వంతు నిలువ

మొత్తం నీటి నిలువ చూసుకున్నా మూడొంతులు మాత్రమే ఉంది. అనంతపురం జిల్లాలోనున్న 304 చెరువుల్లో 7.60 టిఎంసిలు నీటి నిలువ సామర్థ్యం చేసుకునేందుకు వీలుంది. ఇప్పటి వరకు చూస్తే 2.23 టిఎంసిలు నీళ్ల మాత్రమే నిలువ మొత్తం నిలువ సామర్థ్యంలో 28.65 శాతమే నీరుంది. సత్యసాయి జిల్లాలోనూ 15.19 టిఎంసిలయితే 2.76 టిఎంసిలు మాత్రమే నీరుంది. సత్యసాయి జిల్లాలో 19 శాతంలోపే నీరు నిలువ ఉంది.

హంద్రీనీవా ద్వారా ఎన్ని చెరువులకు నీరొచ్చేనా ?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెరువులకు ఈసారి ఎన్ని చెరువులకు నీరందిస్తారన్నది చూడాల్సి ఉంది. 50 చెరువులకు ఏటా నీరు అందిస్తున్నారు. అయితే వీటిలో వేటికి ఏ రకంగా ఇస్తారన్న దానిపై స్పష్టత ఉండదు. రాజకీయ పలుకుబడి ఆధారంగానే నీళ్ల ఆయా ప్రాంతాల్లోని చెరువులకు అందిస్తున్నారన్న విమర్శ ఉంది.

ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ - సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి వద్ద సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎంతో కీలకంగా ఉన్న సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ విమర్శించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అభివృద్ధి చేసి, మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నాడు స్థానిక సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గేయానంద్ మాట్లాడుతూ ఆసుపత్రికి అభివృద్ధికి కావాల్సిన వసతులను సమకూర్చడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. చాల విభాగాల్లో సేవలు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. బ్లడ్ బ్యాంక్ లేదన్నారు. కార్డియోథొరాసిక్ సర్జరీ,క్యాన్సర్ ఆసుపత్రిని అనుసంధానం చేసి అప్‌గ్రేడ్ చేయాలన్నారు. క్యాజువాలిటీతో పాటు బిగ్గర్ ఎండ్‌ను ఏర్పాటు చేసి క్యాన్సర్ రోగులకు వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న అన్ని వైద్యుల, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వవైద్య కళాశాలను ప్రయివేటు యాజమాన్యానికి అప్పజెప్పే ప్రక్రియను వెంటనే ఆపాలన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.కొండయ్య, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. విద్య, ఆరోగ్య రంగం ప్రభుత్వ అధీనంలోనే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక ఉపాధ్యక్షులు డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ ప్రసూన, సిఐటియు నగర ఉపాధ్యక్షులు వి.రామిరెడ్డి, ప్రకాష్, మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ జాతీయ నాయకులు మనోహర్, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు రామిరెడ్డి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

విఎస్.అచ్యుతానందన్ జీవితం స్ఫూర్తినీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్.అచ్యుతానందన్ జీవితం స్ఫూర్తినీయం అని సిపిఎం నాయకులు కొనియాడారు. అచ్యుతానందన్ మతికి సంతాపంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.సావిత్రి తదితరలుఉ పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచిన నేత అచ్యుతానందన్ అన్నారు. కేరళ ప్రజల మనస్సుల్లో ఆయన పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. ఆయన పోరాటాం, పరిపాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. ప్రజా పోరాటాలలో ముందుండడమే కాకుండా నిరాడంబర జీవితం గడిపారన్నారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేసిన గొప్ప నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, ఎం.కృష్ణమూర్తి, బాల రంగయ్య, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు కేశవరెడ్డి, నగర సహాయ కార్యదర్శి రమణయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, కె.భాస్కర్, వై.వెంకటనారాయణ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాశ్ రెడ్డి, మసూద్, ఎన్టీఆర్ సీనా, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, ఆదినారాయణ పాల్గొన్నారు.

అనంతపురంలో నివాళి అర్పిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

గుంతకల్లులో నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరులోటు: సిపిఎం

గుంతకల్లు : కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్‌జఅచ్యుతానందన్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం తెలిపారు. అచ్యుతానందన్‌కు నివాళి కార్యక్రమాన్ని మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ విఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఎస్ అచ్యుతానందన్ కేరళ రాష్ట్రంలోనే కాకుండా దేశ రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన మతి పార్టీకే కాకుండా కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కసాపురం రమేష్, సురేంద్ర బాబు, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, షాషా, బాషా, రాము నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కసాపురం రమేష్, సంచార జాతర రాష్ట్ర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

చంద్రబాబు పాలనలో రాష్ట్రం ముందడుగు

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో శ్రమిస్తున్నారని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. రాయదుర్గం పట్టణంలోని 28, 29 ఎన్నికల వార్డుల్లో మంగళవారం నాడు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తామిచ్చిన హామీల్లో రూ.4వేలకు పెరిగిన పెన్షన్ సక్రమంగా సకాలంలో అందిస్తున్నామన్నారు. ఒక ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున తల్లికివందనం ఇచ్చామన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో ఇచ్చే డబ్బులు త్వరలోనే రైతులకు అందుతాయన్నాయన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మ్యున్సిపల్ వార్డు సభ్యులు బుల్లారి జ్యోతి, పద్మజ, మాజీ సభ్యులు టంకశాల హనుమంతు, ధనర్జున, సుమలత, మంజునాథ, నాయకులు శ్రీనివాసులు, రాజశేఖర్, రవి, ప్రవీణ్, కిరణ్, తిప్పేస్వామి, షబ్బీర్ పాల్గొన్నారు.

ఏపీకే సందేశాలతో జాగ్రత్త : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

సెల్‌ఫోన్లకు ఈ చలాన్ పేరుతో వచ్చే ఎపికె సందేశాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ పి.జగదీష్ ప్రజలకు సూచించారు. ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్ తొందరపడి క్లిక్ చేయొద్దన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో ఈ లింక్‌ను క్లిక్ చేస్తే సైబర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు ఎస్ఎస్ ట్యాంక్‌కు నీటి విడుదల

రాయదుర్గం : కనేకల్ వద్ద గల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు తుంగభద్ర ఎగువ కాలవ నుంచి నీటి పంపింగ్, గంగపూజ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. తుంగభద్ర రిజర్వాయర్ నుంచి ఎగువ కాలువకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో కాలువ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటిని పంపింగ్ చేయనున్నట్లు కమిషనర్ వివరించారు.

నాసిరకంగా నిట్టూరు చెరువు కట్ట నిర్మాణం

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-యల్లనూరు

సుజల స్రవంతి పథకంలో భాగంగా గండికోట ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పంపు సెట్ల ద్వారా చెన్నేకొత్తపల్లి, యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులను గత ప్రభుత్వంలో పూర్తి చేశారు. అందులో ఎల్6 కింద 85నిట్టూరు చెరువు నిర్మాణానికి రూ.165కోట్లతో పనులు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో 40శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం చెరువు కట్ట నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు జరుగుతున్నా ఇంజినీరింగ్ జెఈ కానీ డీఈ కానీ పరిశీలించిన దాఖలాలు లేవు. కట్ట నిర్మాణం మూడు లేయర్ల మట్టి, ఇసుక, గ్రావెల్‌తో జరగాలి. ఇందుకు విరుద్ధంగా గుత్తేదారులు ఇసుక, మట్టితోనే గ్రావెల్ వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పది గ్రామాలకు సాగు నీరు అందించే చెరువు కట్ట నిర్మాణం నాణ్యత లేకుండా చేస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు కట్ట పర్యవేక్షణ చేసి నాణ్యతగా పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు.

నిట్టూరు చెరువు కట్టపై జరుగుతున్న పనులు

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం : అనంత

అనంత, నార్పల సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నార్పల సత్యనారాయణ రెడ్డి తన మద్దతుదారులతో కలిసి అనంత వెంకటరామిరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అరాచకాలకు అధికం అయ్యాయన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై అకారణంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. వీటిని బలంగా తిప్పికొట్టాలన్నారు. వైఎస్.జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, నార్పల పుట్లూరు కన్వీనర్లు ఖాదర్ వలీ ఖాన్, మహేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచి శ్రీరాములు, మాజీ కోఆప్షన్ సభ్యులు దాడితోట బాషా, మాజీ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ అమీర్ బాషా, ఎంపీటీసీలు శంకర్ యాదవ్ రాజారెడ్డి, పద్మాకర్ రెడ్డి, తుంపెరా పక్కిరెడ్డి, సర్పంచి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు కృషి : గుమ్మనూరు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

రాయలసీమకు నీటిని అందించి, సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. హంద్రీనీవా నుంచి మల్యాల వద్ద విడుదలైన నీరు మంగళవారం నాడు కసాపురం 143 కిలోమీటర్ల బ్రిడ్జి వద్దకు చేరుకున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే జల హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం మల్యాల నుంచి 320 క్యూసెక్కుల నీరు విడుదల అయ్యాయన్నారు. జీడిపల్లి, కుప్పం వరకు నీరు వెళ్తాయన్నారు. చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టత్మాకంగా చేపట్టిన హంద్రీనీవా కాలువ ద్వారా రాయలసీమ ప్రాంతానికి నీరు వస్తున్నాయన్నారు. ఈ నీటితో ఈ ప్రాంత రైతులు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా రైతులు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, డాక్టర్ హిమబిందు, టిడిపి మండల అధ్యక్షుడు రామన్న చౌదరి, బిజెఎంఎం వైస్ ప్రెసిడెంట్ వనగుంది విజయలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, కూటమి నాయకులు మహానంది, దోసలుడికి గ్రామపంచాయతీ నాయకులు సుబ్బయ్య, జిలకర సూరి, క్షేత్ర సహాయకుడు దామోదర సంజప్ప పాల్గొన్నారు.

జలహారతి ఇస్తున్న గమ్మనూరు జయరాం

25న ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

ఉపాధి కల్పనాధికారి ఎస్.పల్లవి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంత, సత్యసాయి జిల్లాలకు సంబంధించిన యువతీ యువకులకు ఈనెల 25న అనంతపురం నగరంలోని ఉపాధి కల్పనా కార్యాలయం ఆవరణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎస్.పల్లవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు హాజరు అయ్యేవారు 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి, ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగినవారై ఉండాలన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10-30 గంటలకు నగరంలోని కోర్టు రోడ్డులో గల ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు జిల్లాలో స్పందన, స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వీరికి రూ.14వేల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇస్తారన్నారు.

గూగూడులో హుండీ గల్లంతుపై పుకార్లు

అలాంటిదేమీ లేదు : ఆలయ ఈవో

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు కానుకలు వేయడానికి హుండీలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక హుండీ గల్లంతు అయినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దీనిపైన ప్రజాశక్తి ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభాను వివరణ కోరగా కొందరు కావాలనే పనిగట్టుకుని ఇలాంటి పుకార్లు సృష్టిస్తున్నారని తెలిపారు. కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు రెండు పూర్తిగా సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉన్నాయన్నారు. కుళ్లాయి స్వామి, తాత్కాలిక హుండీలు శాశ్వత హుండీలు దేవాదాయశాఖ అధికారులు మాత్రమే లెక్కించారన్నారు. హుండీల వివరాలపై సీసీ కెమెరాలు పరిశీలించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

25న వాహనాల వేలం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి వాహనాలను ఈ నెల 25వ తేదీ వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ టి.సునీల్ కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్‌కార్డుతో ఉదయం 10 గంటలకు కంబదూరు ఎక్సైజ్ స్టేషన్‌కు రావాలన్నారు. వేలంలో దక్కించుకున్న వాహనాలకు అదే రోజు పూర్తి స్థాయి నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అనధికార లేఅవుట్లపై అహుడా చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లేఅవుట్లపై అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గోవిందపల్లి, వడియంపేట గ్రామపంచాయతీల పరిధిలో అనధికారికంగా వేసిన లేఅవుట్లను మంగళవారం అహుడా ప్లానింగ్ ఆఫీసర్లు ఇషాక్, హరీష్ చౌదరిలు సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. గోవిందపల్లి గ్రామంలో 78, 145, 165 సర్వే నెంబర్లు, అదేవిధంగా వడియంపేట గ్రామపంచాయతీ పొడిరాళ్ల గ్రామంలో 295, 279, 84, 85, 87 పార్ట్ సర్వే నంబర్లలో అనధికారికంగా వేసిన లేఅవుట్లలో రాళ్లను తొలగించారు. సంబంధిత యజమానులు తక్షణమే అహుడా అనుమతులు తీసుకుని పక్షంలో తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనాధికార లేఅవుట్లను పరిశీలిస్తున్న అహుడీ అధికారులు

తిప్పేస్వామిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసీపీ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బి.తిప్పేస్వామిని ఆపార్టీ నాయకులు సన్మానించారు. వైసీపీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, ఆపార్టీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు, రాష్ట్ర అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, బోరంపల్లి కృష్ణారెడ్డిలు దుశ్శాలువాలతో సన్మానించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తిప్పేస్వామి కష్టపడి పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆంజినేయులు, కిరిటీయాదవ్, పరమేశ్వరప్ప, ఆటో అంజి, దొణతిమ్మప్ప, జాకీర్, బాబా, వంశీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలకు వచ్చిన ఒక విద్యార్థి తండ్రిపై ఆ పాఠశాల ఉపాధ్యాయుడి ప్రవర్తనను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ మాట్లాడుతూ విద్యార్థి తండ్రి పట్ల తెలుగు ఉపాధ్యాయుడు రాజు బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి వచ్చినప్పటికీ ఎందుకు స్పందించడం లేదన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్లిన వారికి సన్మానం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లేశ్వరి, సూపర్‌వైజర్ యుగంధర్, నర్సులు శశికళ, వైఎస్.మెహరీన బేగం, శారద, విజయలక్ష్మి బదిలీ అయ్యారు. వీరికి సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం నాడు ఆసుపత్రి ఆవరణంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం డాక్టర్‌శ్రావణ్ కుమార్, డాక్టర్ శ్రీ లక్ష్మి, వైద్య సిబ్బంది శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కూటమి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మాజీ సర్పంచి చిత్తప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముప్పులకుంట గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి పాలనలో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిన సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామచంద్రప్ప, గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎర్రిస్వామి, యూనిట్ ఇన్‌ఛార్జి మల్లేష్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందప్ప, గ్రామ కమిటీ మెంబర్ ప్రదీప్, తెలుగుదేశం కార్యకర్తలు తిమ్మరాజు, శంకరప్ప, తమ్మప్ప, రాజేష్, జనసేన నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సర్వేయర్లు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో సర్వేయర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సచివాలయాలకు నూతన సర్వేయర్లు వచ్చారు. ఇందులో భాగంగా నూతన సర్వేయర్లు వారి పరిధిలోని సచివాలయాల్లో బాధ్యతలు చేపట్టారు.

జిల్లా గ్రంథాలయం సీనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివశంకర్ ప్రసాద్ మంగళవారం నాడు మరణించారు. అనారోగ్యంతో ఆయన ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మరణించారు. శివశంకర్‌ప్రసాద్ మృతికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, వై.ప్రతాప్ రెడ్డి, రవికుమార్ నాయుడు, హెచ్.రామాంజినేయులు, హెచ్.శ్రీనివాసులు, గోవిందు, విజయభాస్కర్, శ్రీపతి, రామాంజినమ్మలు నివాళి అర్పించారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY

S.O.P.No.5/2025

Between:

1.C.Achamma,
2.C.Kiran Kumar ...Petitioners

V/s

1.D.Savitri,
2.C.Kambagiri,
3.T.Narayanamma,
4.G.Nagaraju ...Respondents

ప్రకటన

అర్జీదారులు,తాము సి.లక్ష్మిదేవి యొక్క వారసులమనియూ ఆమె జీవిత కాలములో అర్జీదారుల యొక్క నివాసంలో జీవించి యున్నదని, ఆమె జీవిత కాలములో Running Deposit A/c ను ఓపెన్ చేసి, అందులకు నామినిగా 1వ అర్జీదారురాలు యొక్క భర్త, 2వ అర్జీదారునికి తండ్రి అయిన సి.నారాయణస్వామిని నియమించినది. సి.నారాయణస్వామి సి.లక్ష్మిదేవికి ముందే మరణించినాడు.సి.లక్ష్మిదేవి తేది:3-11-2022వ తేదిన మరణించినందున, అర్జీదారురాలు సి.లక్ష్మిదేవి యొక్క వారసులమనియు, ఆమెకు రావలసిన మొత్తం అర్జీదారులకే చెందుతుదని వారి పేరిట Succession Certificate ఇవ్వవలసినదిగా పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసియున్నారు.అందులకు ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల తేది:25-07-2025 నాడు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల సదరు అర్జీని కోర్టువారు విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

జి.శ్రీకాంత్ రెడ్డి,
అడ్వకేట్, గుత్తి.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా

ప్రభుత్వం పెంచిన వేతనాలపై అసంతృప్తి

5,6,7 తేదీలలో విజయవాడలో దీక్షలు

అనంతపురం కార్పొరేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 11వరోజు కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, నాగభూషణ, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు, వెంకటనారాయణ, ముత్తుజా, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గోపాల్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ఎటిఎం నాగరాజు, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం 124 జీవో ద్వారా మున్సిపల్ కార్మికులకు వేతనం రూ.3500 పెంచుతున్నట్లు ప్రకటించిందన్నారు. ఈ నిర్ణయం కార్మికులకు సంతృప్తిగా లేదన్నారు. సమ్మె చేస్తున్న కార్మిక సంఘంతో చర్చించకుండా కార్మికుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. తక్కువ వేతనాలు పెంచడాన్ని సిఐటియుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తూ, ఆగస్టు 5,6,7వ తేదీల్లో విజయవాడ కేంద్రంలో నిరవధిక దీక్షలు చేపడతామని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్, ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబులపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, పారిశుధ్య విభాగం నగర కార్యదర్శి తిరుమలేసు, లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, నారాయణ, శివన్న, పెన్న, లక్ష్మి పాల్గొన్నారు.

రాయదుర్గం: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను మంగళవారం నుంచి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లికార్జున తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు పోరాటానికి స్పందించిన ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలను రూ.3500 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటిస్తూ నూతన జీవో నెంబర్ 124ను విడుదల చేసిందన్నారు. అయితే ఈ వేతన పెంపు పట్ల కార్మికులు సంతృప్తిగా లేరని తెలిపారు. ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామనానరు. ఆగస్టు నెలలో దశలవారీగా పోరాటాలను నిర్వహిస్తామని చెప్పారు.

కళ్యాణదుర్గం టౌన్ : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. కార్మికులు వన్నూరుస్వామి, శివకుమార్, వెంకటేశులు, దుర్గమ్మ, హనుమంతులతో పాటు మిగిలిన కార్మికులు సమ్మెలో పాల్గొని సమస్యలపై మాట్లాడారు. వెట్టిచాకిరి చేస్తున్న తమకు సంక్షేమ పథకాలు ఎందుకు వర్తింపజేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి బకాయి బిల్లులు చెల్లించండి

పీడీకి వినతిపత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ బిల్లులను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీం బాషాను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9,నుంచి 10 వారాలు చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బిల్లును వెంటనే కూలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పనిముట్లు గడ్డపార పారాలు, గంపలు, గుణపం ఇవ్వాలన్నారు. 8. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన వారందరికీ కొత్త జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనుల దగ్గర ప్రమాదవశాత్తు చనిపోయిన వ్యవసాయ కూలీలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. వీటితో పాటు కూలీలు, మేట్ల సమస్యలు పరిష్కరించే దిశగా చూడాలని పీడీని కోరారు.

శక్తి టీమ్స్‌కి డ్రోన్ల వినియోగంపై శిక్షణ

శక్తి టీం వినియోగించే ద్విచక్రవాహనాలు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

డ్రోన్లతో నిఘా వేసి మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా అంకితభావంతో పని చేయాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జిల్లాలోని శక్తి టీమ్స్‌కు డ్రోన్ల వినియోగంపై మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు జరుగకుండా ఉండాలంటే ఏమి చేయాలో ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ముందుగా మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్, వారు వినియోగించనున్న 28 ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. మహిళలపై వేధింపుల నియంత్రణే ధ్యేయంగా శక్తిటీమ్స్ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సిఐలు ధరణీ కిశోర్, క్రాంతికుమార్, వెంకటేశులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలంపిలుస్తోంది

అనంతపురం : తాటిచర్ల, సోములదొడ్డి గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మల్లికార్జున, గ్రామ ఉద్యాన సహాయకులు గంపరాజు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని తిమ్మాపురం, నక్కన దొడ్డి గ్రామాల్లో వ్యవసాయ అధికారి లీనా వసుంధర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, యంత్ర పరికరాల సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పంట సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వాతావరణ ఆధారిత బీమా,ర దిగుబడి ఆధారిత బీమా గడువును ఈనెల జూలై 31 వరకు ప్రభుత్వం పొడగించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శివరాజ్, ఎంపిఇఒ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్‌లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

రాయదుర్గం రూరల్ : వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజ కుమారి పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణ పరిధిలోని పై తోటలో మండల వ్యవసాయ అధికారి అహ్మద్ భాషా ఆధ్వర్యంలో రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడిఏ రైతులకు పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ మనోజ్, ఎంపీఈఓ షామిలి, రైతులు పాల్గొన్నారు.

కణేకల్లు : మండల పరిధిలోని గనిగేర, బెనేకల్ గ్రామాల్లో వ్యవసాయ అధికారి జగదీష్ ఆధ్వర్యంలో రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కేంద్రం నుంచి వనరుల వ్యవసాయ అధికారి లక్ష్మీ నరసింహులు రైతులకు పలు యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వేసుకుంటే ఫలితాలు బాగుంటాయన్నారు.

ఉరవకొండ : మాలాపురం, విడపనకల్ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కైలాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని వేములపాడు గ్రామ సచివాలయంలో పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను సర్పంచి మైల ఓంకారమ్మ, ఆమె కుమారుడు సాంబశివుడు ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. విజయలక్ష్మి, కె.సతీష్ బాబు, కె.కిరణ్ కుమార్, పి.మంజునాథ్, కె.దివ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేములపాడు గ్రామ పంచాయతీ సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారంలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ముందుగా జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి, న్యాయమూర్తి ఎన్.రాజశేఖర్ ఉపకారాగారాన్ని తనిఖీ చేశారు. జైలులోని రికార్డులు, బ్యారెకులు, వంటగది, స్టోర్ గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ చాలామంది క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలుకు వస్తూ కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, ప్యానల్ న్యాయవాది విసి.గంగాధర్ కుమార్, కోర్టు టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

గత పాలనలో మున్సిపాల్టీ అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పూర్తిగా అభివృద్ధికి దూరం అయ్యిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విమర్శించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే పట్టణంలోని 15,16 వార్డులలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన గత వైసీపీ పాలనలో పాలకులు మున్సిపాలిటీలలో నెలకొన్న సమస్యలపై పరిష్కరించేందుకు శ్రద్ధ చూపలేదన్నారు. ఈ కారణంగా ప్రస్తుతం ఏవార్డులో చూసిన అభివృద్ధి అస్తవ్యస్తంగా వుందన్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో వైసీపీ సమన్వయకర్త రంగయ్య కనుసన్నుల్లో మున్సిపల్ చైర్మెన్ రాజ్‌కుమార్ వున్నారని, అభివృద్ధి పనుల నిర్వహణ విషయంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకు ముందుకు రావడంలేదని ఆరోపించారు. అభివృద్ధి పై వైసీపీ వాళ్లకు చిత్తశుద్ధి లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన మాట మేరకు దశల వారిగా సూపర్ సిక్స్ అమలు చేస్తున్నరని వివరించారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మెన్ లక్ష్మిదేవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీ నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ నిధులను మంజూరు చేయాలని కోరుతూ మండలం పరిధిలోని గార్లదిన్నె నరసాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీ మద్దతుగా నినాదాలు చేశారు. ఆర్డీటీ సేవలను ప్రజలకు దూరం చేయకుండా కేంద్రం స్పందించి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఎఐఎస్ఎ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఉరవకొండ మండలం నూతన కమిటీని ఎన్నిక చేసినట్లు ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ భీమేష్, జిల్లా అధ్యక్షులు శివకుమార్ తెలిపారు. మండల అధ్యక్షులుగా హరి నాయక్, ప్రధాన కార్యదర్శిగా వినయ్, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, సహాయ కార్యదర్శిలుగా ప్రదీప్, ఈశ్వర్‌లతో కార్యవర్గ సభ్యులుగా సురేష్, సాయి, వంశీ, ఎర్రిస్వామి, చరణ్‌లను ఎన్నుకున్నారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S.No.261/2022

Between:

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, తాడిపత్రి,
Rep by ghs Branch Manager ...Plaintiff

మరియు

1.కొడతాల భాస్కర్ గౌడ్,
2.పెమ్మసాని సంజీవ నాయుడు ...Defendant

ప్రతివాదులకు దావా సమన్లు

1.కొడతాల భాస్కర్ గౌడ్ S/o చెంచయ్య, D.No.2/729-7-2, అంబేద్కర్ నగర్, తాడిపత్రి,
1.పెమ్మసాని సంజీవ నాయుడు S/o శ్రీరామ నాయుడు, D.No.3/1128-A, గన్నేవారిపల్లి కాలనీ, తాడిపత్రి,

పై దావాలో వాది మీపైన పై కోర్టునందు తమ బాకీ రాబట్టుకొనుటకు సివిల్ దావా దాఖలు చేసి ఉన్నాడు.సదరు దావాలో మీ హాజరు నిమిత్తము కోర్టువారు 28-07-2025 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు పై తేదిన పై కోర్టు ఎదుట మీరు స్వయంగా కానీ లేక వకీలు ద్వారా కాని ఉదయం 10:30 ని॥లకు హాజరై మీ అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోవచ్చును. లేని యెడల దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:28/07/2025

ఎన్.విజయభాస్కర్ రెడ్డి,
వాదితరుపు వకీలు, తాడిపత్రి.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE; ANANTAPURAMU

S.O.P.No.7/2025

Between:

Moulvi Shabana Begum W/o Late Kanisettipalli Sadakvali, Muslim, age about 37 years, R/at D.No 1-3-326, Rangaswamy Nagar, Anantapuramu ...Petitioner

AND

Nil ...Respondents

ప్రకటన

పై నెంబరు కేసులో అర్జీదారురాలు తన భర్త **కనిశెట్టి సాదక్ వలి** చనిపోయినందు వలన అతనికి రావలసిన బెనిఫిట్స్ మరియు పెన్షన్ మొత్తం రాబట్టు కొనుట కొరకు అర్జీదారురాలు వారసత్వపు సర్టిఫికేట్ కొరకు పై కోర్టులో అర్జీదాఖలు చేసుకున్నారు.సదరు కేసు 25-07-2025 వ తేదికి వాయిదా వేసినారు.కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను.లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానించెదరు అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

B.RAMACHANADRA
Advocate, Anantapuramu.
Cell no: 9440243444

బాబుపాలనలో మోసం గ్యారెంటీ

మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

ఎన్నికల హామీలను అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు పాలనలో మోసం గ్యారెంటీగా మారిందని వైసిపి నాయకులు విమర్శించారు. మంగళవారం పామిడి మండల కేంద్రంలోని ఎద్దులపల్లి రోడ్డు రహమత్ ఫంక్షన్‌హాల్‌లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, ఆర్గనైజేషన్ జిల్లా సెక్రెటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అపద్దపు హామీలతో గద్దెనెక్కారన్నారు. ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎద్దులపల్లి దిలీప్ రెడ్డి, మూలింటి నాగేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సాకే ఓబులేసు, మీసాల రామచంద్ర, ప్రసాద్, నరసింహ, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

హిజ్రా అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి రైల్వే జంక్షన్ పరిధిలోని పామిడి మండలం ఎదురూరు గ్రామ శివారులో గుత్తి–అనంతపురం రైలు మార్గంలో హిజ్రా అనుమానాస్పద స్థితిలో మరణించారు. గుత్తి జీఆర్పీ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పామిడి మండలం ఎదురూరు గ్రామానికి వంశీ అలియాస్ శ్రీవాణి గత రెండేళ్లుగా హిజ్రాగా మారారు. అనంతపురం నగరంలో నివసిస్తుండేవారు. సోమవారం రాత్రి అనంతపురం నుంచి కల్లూరుకు బస్సులో వచ్చి, అక్కడి నుంచి ఎదురూరు గ్రామంకు వెళ్లారు. ఇంటికి ఫోన్ చేసిన అనంతరం గ్రామ శివారులో ఉన్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సమీప గ్రామాల ప్రజల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని వంశీ అలియాస్ శ్రీవాణిగా గుర్తించారు. కాగా కుటుంబ సభ్యులు మాత్రం వంశీ అలియాస్ శ్రీవాణిని ఎవరో హత్య చేసి రైలు పట్టాలపై పడేశారని ఆరోపించారు. ఘటన స్థలాన్ని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసులు పరిశీలించారు. హిజ్రా ఆత్మహత్య చేసుకున్నారా.. లేక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న విధంగా హత్య జరిగిందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సేవా కేంద్రంలో దొంగలు పడ్డారు..!

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఊబిచెర్ల గ్రామ రైతు సేవ కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో సోమవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. గుర్తు తెలియని దుండగులు తలుపులను బద్దలు కొట్టి లోనికి ప్రవేశించారు. అందులో ఉన్న కంప్యూటర్, రైతులకు రాయితీ కింద పంపిణీ చేయాల్సిన కంది విత్తనాల పాకెట్లను ఎత్తుకెళ్లారు. ఘటనపై ఎంపీడీవో డి.ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తండ్రిచెంతకు మతిస్థిమితం లేని యువకుడు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తప్పిపోయిన మతిస్థిమితం లేని యువకుడిని త్రీటౌన్ పోలీసులు తండ్రికి అప్పగించారు. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు బుద్ధిమాంద్యం కల్గిన 18 సంవత్సరాల తన కుమారుడు భరత్ హైదరాబాద్‌కు వెళ్లిన సమయంలో తప్పిపోయాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించిన సిఐ శాంతిలాల్ సిసి కెమెరాల ఆధారంగా యువకుడు బద్వేల్ బస్సు ఎక్కాడని గుర్తించి బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద భరత్‌ను కనుకొన్నారు. కుమారున్ని తండ్రి శ్రీరాములుకు అప్పగించారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సమస్యలపై హోం మంత్రికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న వైసిపి ఎస్సీ సెల్ విభాగం నాయకుల్ని హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గం అని ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శింగనమల నియోజకవర్గం వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీలపై కూటమి పాలనలో అనేక దాడులు జరిగాయన్నారు. దీనిని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్దామంటే పోలీసుల చేత అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులను మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భాస్కర్, మేజర్ పంచాయితీ సర్పంచి పార్వతి, సర్పంచి సాకే రామాంజనేయులు, నాగేంద్ర, జయరాం పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన బాలికల వసతి గృహంలో పిచ్చి మొక్కలను అధికారులు తొలగించే ఏర్పాటు చేశారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. వసతి గృహాన్ని అన్ని వసతులతో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, విఆర్వో తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాలకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎన్టీఆర్ గృహాలకు నమోదు చేసుకోండి అని ఇన్‌ఛార్జి డిఈ రామ్మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని గృహ నిర్మాణ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న ఇళ్లు లేని నిరుపేదలు తమ సొంత స్థలం రెండు సెంట్ల పైబడి ఉన్నవారు గ్రామ సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులు గతంలో నిర్మించుకుని అసంపూర్తిగా ఉన్నవారికి రూ.50 వేలు ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నియోజకవర్గ రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీని మంగళవారం ఎనుక్కున్నారు. గౌరవాధ్యక్షుడుగా గోళ్ల సుధాకర్ నాయుడు, అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా బి.రాము, ఉపాధ్యక్షుడిగా దలవాయి వెంకటేష్, కార్యదర్శిగా జయప్రకాష్ బాలా, జాయింట్ సెక్రటరీగా ఎద్దుల రాజేష్‌లను ఎన్నుకున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. మండలంలోని బేతాపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.ధనుంజయ, వీఆర్వో పక్కీరప్ప, విఏఏ హరిత, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని రైతు సేవ కేంద్రంలో మండలంలోని రైతు సేవ కేంద్రాల అధికారులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి చిన్న వీరాస్వామి సమాచార హక్కు చట్టం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సి.ప్రసాద్ రైతు సేవ కేంద్రాల అధికారులు పాల్గొన్నరు.

యాడికి : మండల కేంద్రంలోని సంతమార్కెట్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. అధికారుల్లో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడానికి సమాచారహక్కు చట్టాన్ని రూపొందించారన్నారు. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి రాంబాబు, ఎంపిఇఒ నాగలక్ష్మి, రేష్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

ప్రజాశక్తి-పుట్లూరు

శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త సాకే శైలజనాథ్ పిలుపుమేరకు పుట్లూరు మండల వైసిపి కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫోస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబులాపురం, దోసలేడు, సంజీపురం గ్రామాల్లో వైసిపి నాయకులు పర్యటించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన విభాగ కార్యనిర్వాహక సభ్యుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రమణ యాదవ్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణమ్మ, సీనియర్ నాయకుడు నాగేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గంగరాజు, విశ్వనాథరెడ్డి, గోపాల్ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు